క్లుప్తంగా

'ప్లాస్టిక్‌పై సమరం'తో ఫలితాలు

తుని: 'ప్లాస్టిక్‌పై సమరం' కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ నిర్వహించిన దాడుల్లో 120 కిలోల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నామని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు గురువారం తెలిపారు. ఇందులో 80 కిలోల కవర్లను ఈ నెల 19న జిందాల్ ఫ్యాక్టరీకి తరలించామన్నారు. ప్లాస్టిక్‌పై తనిఖీలు వచ్చే నెల 6 వరకూ కొనసాగుతాయని, తర్వాత వ్యాపారుల దగ్గర దొరికితే అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. దీనిపై పట్టణంలోని వ్యాపారులందరికీ నోటీసులు జారీ చేశామని, కొందరు ఇప్పటికీ కవర్లను వినియోగిస్తున్నట్టు తనిఖీల్లో బహిర్గతమైందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అందరూ పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నివేదన గంటకు భద్రత కరవు



అన్నవరం: సత్యదేవుని నివేదన సమయంలో మోగించే కంచు గంటకు సరైన భద్రత కరవైంది. సుమారు రూ.లక్ష విలువైన ఈ గంటను మాజీ ఎంపీ చంద్రు శ్రీహరి గత ఏడాది దేవస్థానానికి సమర్పించారు. దీనిని స్వామివారి ఆలయం లోపల ఏర్పాటు చేసి, స్వామి వారికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి నివేదన సమయంలో అర్చకులు ఈ గంటను మోగించేవారు. అయితే, అక్కడ ఇరుకుగా ఉండటంతో పాటు, భక్తులను గర్భాలయ ప్రదక్షిణకు అనుమతిస్తే అడ్డంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ గంటను ఈఓ చంద్రశేఖర్ అజాద్ తూర్పు రాజగోపురంలోకి మార్పించారు. ఈ గోపురం ద్వారా రాకపోకలు సాగించే భక్తులకు అందుబాటులో ఉండటంతో భక్తులు, చిన్నారులు ఈ గంటను తరచుగా మోగిస్తున్నారు. వేళాపాళా లేకుండా నివేదన గంట మోగడంతో తొలుత కంగారు పడిన అధికారులు.. తరువాత విషయం తెలిసి ఊరుకున్నారు. ఈ మార్పు వలన ఈ గంటను సమర్పించిన దాత ఆశయం నెరవేరడం లేదని, పైగా దాని పవిత్రత దెబ్బ తింటోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ గంటకు తగిన భద్రత కల్పించాలని కోరుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు 14 మంది గైర్హాజరు

కిర్లంపూడి: స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ కళ్యాణ్ కుమార్ తెలిపారు. ఫస్టియర్ 226 మంది విద్యార్థులకు గాను 214 మంది, సెకండియర్ 25 మందికి 23 మంది హాజరయ్యారని వివరించారు.

రాజ్యలక్ష్మికి విశిష్ట సేవా పత్రం

తుని: స్థానిక రెడ్‌క్రాస్‌లో 20 ఏళ్లు సేవలందించిన సమయమంతుల రాజ్యలక్ష్మికి విశిష్ట సేవా ప్రశంసా పత్రాన్ని తహసీల్దార్ జి.బాలసుబ్రహ్మణ్యం అందజేశారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ భవనంలో గురువారం ఈ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించి తుని శాఖకు మంచి పేరు తీసుకురావాలని బాలసుబ్రహ్మణ్యం ఆకాంక్షించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ నేరెళ్ల సత్యనారాయణ, ఆకెళ్ల శాస్త్రి, కడిమిశెట్టి సూర్యప్రకాశరావు, గొల్లపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలు సాగు చేయాలి

ఏలేశ్వరం: చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరక్టర్ హరి అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా మర్రివీడు, జె.అన్నవరం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి జ్యోతి ఆధ్వర్యాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ, చిరుధాన్యాల్లో పోషక విలువలు ఉంటాయని, వీటి ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులకు ప్రభుత్వం తరఫున మినీ కిట్లు పంపిణీ చేస్తామని చెప్పారు.

కెరీర్ గైడ్‌లైన్ పుస్తకాల పంపిణీ

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాల్లో గురువారం కెరీర్ గైడ్‌లైన్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యాన గణిత ఉపాధ్యాయుడు కస్నూరి సతీష్‌బాబు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి, గణితంలో మెళకువలు నేర్పారు. అనంతరం మేధస్సు పెంచే ఆటలు ఆడించారు. స్టడీ సర్కిల్ ట్రైనర్ మణికంఠ స్పోకెన్ ఇంగ్లిషుపై శిక్షణ ఇచ్చారు. వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. విద్యార్థులు విధిగా ఈ శిబిరాలకు హాజరు కావాలని సూచించారు.

ఘనంగా యువ దినోత్సవం

ప్రత్తిపాడు: స్థానిక శ్రీ సత్యసాయి మందిరంలో గురువారం శ్రీ సత్యసాయి యువ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద గాయత్రి పఠనం గావించారు. శ్రీ సత్యసాయి బాల వికాస్ చిన్నారులకు ఆటలు, పాటలు, శ్లోకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి, తాగునీరు, మజ్జిగ సరఫరా చేశారు. పేదలకు చెప్పులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి కిర్లంపూడి సబ్ జోన్ కన్వీనర్ కొమ్ముల జయబాబు, సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞాన సుమాలు వికసించేలా..

- సాంకేతిక రంగంలో సృజన పెంచేందుకు విద్యార్థులకు శిక్షణ
- కొత్త ఆలోచనలకు బాటలు వేస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు
- నిపుణుల ఆధ్వర్యాన ఇటీవల ప్రత్యేక శిక్షణ
- ఉపయోగించుకున్న 45 మంది చిన్నారులు



కిర్లంపూడి ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



చీకటి పడితే ఆటోమెటిక్‌గా వెలిగే ల్యాంప్‌లు తయారు చేస్తున్న విద్యార్థులు

కిర్లంపూడి: దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల్లో విజ్ఞాన సుమాలు వికసించేలా.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వారు పట్టు సాధించేలా.. సృజనాత్మకతతో కొత్త ఆలోచనలకు బాటలు వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు వివిధ పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా.. పుణె నగరానికి చెందిన విజ్ఞానాశ్రమం, యునిసెఫ్, జాతీయ విద్య, పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ), నీతి ఆయోగ్ సంస్థల సౌజన్యంతో ఇటీవల ఎంపిక చేసిన పాఠశాలల్లో సమ్మర్ బూట్ క్యాంపులు నిర్వహించారు. మన రాష్ట్రంలో కృష్ణా జిల్లా పెనమలూరు, తిరుపతి జిల్లా వరదయ్యపాళెం, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ, శ్రీకాకుళం జిల్లా ఇప్పిలి, విశాఖపట్నం జిల్లా వేపగుంట, పల్నాడు జిల్లా ఈపూరుతో పాటు కాకినాడ జిల్లా నుంచి కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఈ సమ్మర్ బూట్ క్యాంప్‌లకు ఎంపిక చేశారు. సైన్స్, గణితం సబ్జెక్టుల్లో నూతన ఆలోచనలను మరింతగా పెంపొందించేందుకు అత్యాధునిక సాంకేతికతతో ఇటీవల నాలుగు రోజుల పాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పుణె విజ్ఞాన ఆశ్రమం నుంచి వచ్చిన నిపుణులు వెంకటేష్, అవినాష్ ఈ శిక్షణ నిర్వహించారు. కిర్లంపూడిలోని కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి ప్రైవేటు పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. ఒక్కో ల్యాబ్‌ను సుమారు రూ.10 లక్షలతో నిర్మించారు. కిర్లంపూడి ప్రభుత్వ పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు 2022 ఏప్రిల్ 26న ప్రారంభించారు. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకూ ఎంపిక చేసిన 45 మంది విద్యార్థులకు వీడియో మేకింగ్ అండ్ డాక్యుమెంటేషన్, ఆర్ట్, త్రీడీ ప్రింటింగ్ అండ్ డిజైనింగ్, మెకానికల్ టూల్స్, బేసిక్ ఎలక్ట్రానిక్స్, రొబోటిక్స్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

సాంకేతికతపై ఆసక్తి



ప్రస్తుతం అందరూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఉపయోగిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. జీవితంలో ఇది ఒక భాగంగా మారింది. టెక్నాలజీని నేర్చుకోవడానికి విద్యార్థులు మరింత ఆసక్తి కనబరుస్తున్నారు.

– ఆకుల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు, కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ పాఠశాల, కిర్లంపూడి

రొబోటిక్ సైన్స్‌పై..



మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల చదువుల్లో కూడా మార్పులు వస్తున్నాయి. సమాజానికి ఉపయోగపడే సమస్యలను వెలికి తీసేందుకు మైక్రో కంట్రోలర్ కోడింగ్ ద్వారా రొబోటిక్ సైన్స్ నేర్చుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

– మునుకుట్ల కల్యాణ్ చక్రవర్తి, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి, కిర్లంపూడి పాఠశాల

త్రీడీ ప్రింటింగ్‌లో రాణిస్తా..



త్రీడీ ప్రింటింగ్ నాకు చాలా ఇష్టమైన సబ్జెక్ట్. తక్కువ ఖర్చుతోనే ఇళ్లు నిర్మించుకునేందుకు సులభమైన మార్గం త్రీడీ ప్రింటింగ్. ఇందులో మరింత శిక్షణ పొంది రాణిస్తా.

– షేక్ అబ్దుల్ షారూక్, 9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కిర్లంపూడి

వీడియో ఎడిటింగ్ ఇష్టం



మొదటి నుంచీ వీడియో ఎడిటింగ్‌పై ఆసక్తి ఎక్కువ. దీనిపై అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ఇచ్చిన శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడుతుంది. ల్యాబ్‌లో మరిన్ని విషయాలు తెలుసుకున్నా. దీనిపై ఎక్కువ దృష్టి పెట్టి మరింత పట్టు సాధిస్తా.

– బి.కావేరి, 9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కిర్లంపూడి

సీసీఆర్‌సీలతో కౌలు రైతులకు మేలు



కౌలుదారుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ అశోక్‌కుమార్

తుని రూరల్/కోటనందూరు: పంట సాగు హక్కుల కార్డు (సీసీఆర్‌సీ) పొందడం ద్వారా కౌలు రైతులకు మేలు జరుగుతుందని తుని మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. వల్లూరు, ఎస్.అన్నవరం గ్రామాల్లో గురువారం జరిగిన కౌలుదారుల అవగాహన సదస్సులలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీసీఆర్‌సీ పొందిన కౌలు రైతులకు రైతుభరోసా, పంట రుణాలు, పంటల బీమాతో పాటు విత్తనాలు, ఎరువులపై రాయితీలు లభిస్తాయని వివరించారు. అర్హులైన కౌలు రైతులు సాగు హక్కు పత్రాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వల్లూరు సర్పంచ్ కుర్ర విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పెదకాపు తాతారావు, మాజీ వైస్ ఎంపీపీ కుర్ర సీతారామస్వామి, ఏఈఓ జగ్గప్పారావు, వీఏఏలు పాల్గొన్నారు. కోటనందూరు మండలం అల్లిపూడిలో జరిగిన కౌలు రైతుల అవగాహన సదస్సులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కౌలు రైతులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకే ప్రభుత్వం కౌలు కార్డులు పంపిణీ చేస్తోందని చెప్పారు. కౌలు కార్డుల జారీ విధి విధానాలు, ప్రయోజనాలపై ఏఈఓ కేవీ శివకుమారి అవగాహన కల్పించారు. ఖరీఫ్‌కు ముందస్తుగా సిద్ధం కావాలని సూచించారు.

పగలంతా ఉష్ణతాపం.. ఆపై వర్షపాతం



తుని జీఎన్‌టీ రోడ్డులో కురుస్తున్న వర్షం

తుని/ఏలేశ్వరం/ప్రత్తిపాడు రూరల్/గండేపల్లి: రోహిణీ కార్తె ప్రారంభమైన గురువారమే సూర్యుడు మరోసారి ప్రతాపం చూపాడు. పగలంతా విపరీతమైన ఉష్ణతాపంతో మెట్ట ప్రాంతంలోని తుని, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, గండేపల్లి తదితర ప్రాంతాల ప్రజలు అల్లాడిపోయారు. వేడిగాలులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ తరుణంలో సాయంత్రం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై, చల్లని ఈదురు గాలులు వీచి, వాతావరణం చల్లబడింది. పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి కుండపోతగా వర్షాలు కురియడంతో ప్రజలు సేద తీరారు. తునిలో కుండపోత వర్షం కురిసింది. పట్టణంలోని రోడ్లపై నీరు నిలిచిపోయింది. కాలువల్లో వాన నీటి ప్రవాహం పరుగులు తీసింది. ఈ వర్షం మామిడి, ఉద్యాన పంటలకు కొంత మేలు చేస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఏలేశ్వరంలో కూడా సాయంత్రం వర్షం కురిసి, వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్తిపాడు మండలంలో పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలుగా నమోదు కాగా, ప్రజలు ఆపసోపాలు పడ్డారు. సాయంత్రం ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. గండేపల్లి మండలంలో సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై బలమైన గాలులు వీచాయి. జాతీయ రహదారి వెంబడి పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. పెనుగాలులతో సుమారు 45 నిమిషాల పాటు భారీ వర్షం కురిసింది.

పర్యావరణ హిత జీవన శైలి అలవర్చుకోవాలి

గోకవరం: ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవన శైలి అలవర్చుకోవాలని అటవీ శాఖ మల్లవరం సెక్షన్ అధికారి పి.వెంకట్రావు అన్నారు. మండలంలోని మల్లవరం పంచాయతీ కార్యాలయం వద్ద, రైతుల పంట పొలాల వద్ద సర్పంచ్ యిడుదుల లక్ష్మి ఆధ్వర్యాన గ్రామస్తులకు, రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు జీవన విధానంలో ప్రతి ఒక్కరూ మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తీసుకోవాలని అన్నారు. మొక్కలు పెంచాలని, సమతులాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోకాడ చిట్టిబాబు, సూదికొండ, మల్లవరం బీట్ అధికారులు డి.కామేశ్వరరావు, వై.ఝాన్సీరాణి, టి.రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సంక్షేమాన్ని అందించడమే లక్ష్యం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్

రౌతులపూడి: కుల మత వర్గ రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల నిరుపేదలకు సంక్షేమ పాలన అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎస్.పైడిపాల సచివాలయ పరిధిలోని మల్లంపేటలో ఆయన గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, గడచిన నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించిన వివిధ సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. విద్య, వైద్యం వంటి వాటిని ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, రైతులకు విత్తనాలు, ఎరువులతో పాటు ఎన్నో రాయితీలు అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, ఎంపీటీసీ సభ్యుడు వెంకట లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి



డాక్టర్ శ్రీధర్

తుని రూరల్: వైఎస్సార్ పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ తుని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రైతులకు 80 శాతం, ఎగువన ఉన్న రైతులకు 50 శాతం చొప్పున రాయితీ ఇస్తారన్నారు. మిగిలిన మొత్తాన్ని రైతులు భరించాలన్నారు. ఒకసారి ఈనిన, 2 నుంచి పదేళ్ల మధ్య ఆవులకు, 3 నుంచి 12 ఏళ్ల మధ్య గేదెలకు, ఏడాదిన్నర నుంచి పదేళ్ల లోపు వయస్సు ఉన్న ఎద్దులు, గిత్తలు, దున్నపోతులకు, ఆరు నెలలకు పైబడిన మేకలు, గొర్రెలు, పందులకు బీమా వర్తిస్తుందని వివరించారు. రేషన్ కార్డు కలిగిన ఒక్కో రైతు ఐదు వరకూ పశువులకు బీమా చేయించవచ్చని తెలిపారు. మేకలు, గొర్రెలు, పందులు 50 వరకూ ఉండవచ్చన్నారు. అంటువ్యాధులు, విద్యుత్ షాక్, వరదలు, తుపాన్లు, విష ప్రభావం, క్రూర జంతువుల దాడి, రోడ్డు, రైలు, అగ్ని ప్రమాదాల్లో పశువులు మృతి చెందితే రైతులకు బీమా పరిహారం లభిస్తుందన్నారు. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న పాడిరైతు మూడేళ్లకు రూ.15 వేల పరిహారానికి రూ.480, రూ.30 వేల పరిహారానికి రూ.960 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పాడి రైతులు తమ వాటాగా రూ.15 వేలు పరిహారానికి రూ.192, రూ.30 వేల పరిహారానికి రూ.384 చొప్పున ప్రీమియం చెల్లించాలని తెలిపారు. మేకలు, గొర్రెలు, పందుల లబ్ధిదారు వాటాగా రూ.6 వేల పరిహారానికి ఏడాదికి 3 శాతం, రెండేళ్లకు 4.5 శాతం, మూడేళ్లకు 6.25 శాతం చొప్పున చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు మండల పశు వైద్యులను సంప్రదించాలని శ్రీధర్ సూచించారు.

రహదారి నిబంధనలు పాటించాలి



ఆటో యూనియన్ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న కిర్లంపూడి ఎస్సై రఘునాథరావు

జగ్గంపేట/కిర్లంపూడి: రహదారి భద్రతా నియమనాలను ప్రతి ఒక్కరూ పాటించి, ప్రాణాలను కాపాడుకోవాలని జగ్గంపేట ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ అన్నారు. ×రహదారి భద్రత – ప్రమాదాల నియంత్రణ€పై రామవరంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమానా లేదా నెల రోజుల జైలు శిక్ష విధిస్తారని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్, కార్లు, ఇతర భారీ వాహనాలు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలు వాహనాలు నడపటం నేరమని, అందుకు తల్లిదండ్రులు శిక్షార్హులని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాదని, ఆటో, జీపు, ఇతర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని అన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఆటో యూనియన్ సభ్యులతో ఎస్సై టి.రఘునాథరావు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, అక్రమ రవాణాకు పాల్పడినా, సరైన రికార్డులు లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పేదల సంక్షేమానికే వలంటీర్ వ్యవస్థ

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- జగ్గంపేటలో ఘనంగా 'వలంటీర్లకు వందనం'
- ఇతర ప్రాంతాల్లోనూ సన్మానాలు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



బిళ్లనందూరులో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాస్



ఎస్.అన్నవరంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ

గండేపల్లి: నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ×వలంటీర్లకు వందనం€ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో, అవగాహన కల్పించడంలో వలంటీర్లు ఎంతగానో శ్రమిస్తున్నారని కొనియాడారు. జీతం కోసం కాకుండా సేవా దృక్పథంతో వలంటీర్లు పని చేయడం చాలా సంతృప్తిగా ఉందని అన్నారు. అనంతరం సేవావజ్ర, సేవరత్న, సేవామిత్ర పురస్కారాలతో వలంటీర్లను ఘనంగా సన్మానించారు.

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ద్వారా నియోజకవర్గ పరిధిలోని విభిన్న ప్రతిభావంతులకు ఉచిత త్రీ వీలర్ మోటార్ సైకిళ్లను ఎమ్మెల్యే చంటిబాబు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీలు అత్తులూరి నాగబాబు, చలగళ్ల దొరబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, మండల సచివాలయాల కన్వీనర్, ఉప సర్పంచ్ బండారు రాజా, ఎంపీడీఓ బి.హరికృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పి.నాయకంపల్లిలో..

గండేపల్లి మండలం పి.నాయకంపల్లిలో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందుకున్న వలంటీర్లను సర్పంచ్ మలిరెడ్డి అన్నపూర్ణ ఆధ్వర్యాన సన్మానించారు.

సంక్షేమాన్ని ఇళ్ల వద్దకు చేర్చిన ఘనులు

తుని రూరల్: లబ్ధిదారుల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేర్చుతున్న ఘనత వలంటీర్లదేనని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. ఎస్.అన్నవరం, తాళ్లూరు గ్రామాల్లో వలంటీర్లను ఆయన సత్కరించారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరావు, ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు

కోటనందూరు: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న వలంటీర్లు నిస్వార్థ సేవలు అందిస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాస్ కొనియాడారు. బిళ్లనందూరు, బొద్దవరం, జగన్నాథపురం గ్రామాల్లోని వలంటీర్లను సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన సత్కరించారు. కార్యక్రమంలో లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, సర్పంచులు బొత్స మంగ, వేగి లక్ష్మి, లెక్కల ఉపేంద్ర, ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

ఏలేశ్వరం: వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ అన్నారు. తూర్పు లక్ష్మీపురం, రమణయ్యపేట గ్రామాల్లో వలంటీర్లను సేవామిత్ర అవార్డులతో సన్మానించారు. ఏలేశ్వరం సచివాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ కోరాడ రామలక్ష్మీదేవి, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యాన వలంటీర్లను సన్మానించారు.

చిల్లంగిలో..

కిర్లంపూడి: చిల్లంగి గ్రామంలో స్థానిక నాయకులు సంఘన వెంకటేశ్వరావు, అడారి గంగబాబు ఆధ్వర్యాన వలంటీర్లను వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ సత్కరించారు. తొలుత జగపతినగరం సచివాలయం-3లో పని చేస్తున్న 21 మంది వలంటీర్లను సన్మానించారు.

లంపకలోవలో..

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ లంపకలోవ కార్యాలయంలో గ్రామంలోని 18 మంది వలంటీర్లను సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్, మండల కో ఆప్షన్ సభ్యుడు గంటా మహాలక్ష్మీరావు, ఎంపీటీసీ సభ్యురాలు పంది భార్గవి తదితరులు పాల్గొన్నారు.